సాక్షి
వికారాబాద్
సోమవారం ¦ 1 ¦ జూలై ¦ 2024



రైతుకు ఏదీ భరోసా?
రైతు భరోసా కింద అందించే పెట్టుబడి సాయం ప్రస్తుత సీజన్‌కు అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. 10లో



తాళం తియ్యరు అద్దెకివ్వరు
జెడ్పీ నిధులతో నిర్మించిన మండల పరిషత్ దుకాణ సముదాయం నిరుపయోగంగా మారింది. 10లో



సీజనల్‌పై అప్రమత్తత ఏదీ?
అసలే వర్షాకాలం.. గ్రామాల్లోని వీధులు అపరిశుభ్రంగా ఉండటంతో వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 11లో

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి

తాండూరు టౌన్: తాండూరు ఆర్డీఓ కార్యాలయంతో పాటు అన్ని మండలాల ఎంపీడీఓ కార్యాలయాల్లో నేడు ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనతో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డివిజన్ స్థాయి అధికారులు ఆర్డీఓ కార్యాలయంలో, మండల స్థాయి అధికారులు ఎంపీడీఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. ఇక నుంచి ప్రతి సోమవారం యథావిధిగా ప్రజావాణి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ గోపాల్

యాలాల: రైతు భరోసా పథకానికి సంబంధించి రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలు, సలహాలు, సూచనలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం యాలాల సొసైటీ ఆధ్వర్యంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించిన వివరాలపై చర్చించారు. ఎన్ని ఎకరాల లోపు పథకం వర్తించాలి, కౌలు రైతుల ప్రామాణికం తదితర అంశాలపై రైతులు.. ఉన్నతాధికారులకు తమ అభిప్రాయాలను తెలిపారు. రైతుల సూచించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి యాదగిరి, సొసైటీ సీఈఓ వేణు, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి తదితరులు ఉన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

అనంతగిరి: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరులో గల ఎస్బీఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో.. మహిళలకు.. మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని సంస్థ డైరెక్టర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 19 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయస్సులోపు, పదోతరగతి పాసై ఉన్న మహిళలు శిక్షణకు అర్హులన్నారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని.. మరిన్ని వివరాలకు 85001 65190 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జన్‌మన్‌తో జీవితాలు మారేనా..



చెంచుల స్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

చెంచుల కోసం కేంద్రం ప్రత్యేక పథకం

- మూడేళ్ల పాటు కొనసాగనున్న సాయం
- మౌలిక వసతుల కల్పన, వృత్తి, విద్యను చేరువ చేయడమే లక్ష్యం
- సర్వే పూర్తిచేసిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు
- జిల్లాలో 22 చెంచు ఆవాసాలు, 2,554 జనాభా

వికారాబాద్: చెంచుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్ (పీఎం జన్‌మన్) పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టింది. చెంచు గూడాలు, చెంచుల జీవితాల్లో సమూల మార్పులతో పాటు వారికి మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోంది. ఈ పథకం ప్రారంభించేందుకు ముందు వారి స్థితిగతులు తెలుసుకునేందుకు ఈ యేడాది జనవరిలో జిల్లాలో సర్వేను ప్రారంభించిన అధికారులు ఇప్పటికే దానిని పూర్తిచేశారు. దాదాపు 42 అంశాలతో ఈ సర్వేను చేపట్టారు. జిల్లాలోని 22 ఆవాసాల్లో చెంచులు నివసిస్తుండగా.. 740 చెంచు కుటుంబాలు, 2,554 జనాభా ఉన్నట్లు గిరిజన సంక్షేమ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఎనిమిది బ్లాకులుగా విభజించి ఒక్కో బ్లాక్‌లో ఐదుగురు అధికారుల బృందంతో ఈ సర్వే నిర్వహించారు. అయితే సర్వే పూర్తయి దాదాపు ఆరు నెలలు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు పథకంలో భాగంగా చేపట్టాల్సిన పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

పొందుపర్చిన అంశాలు..

పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా అనేక అంశాలను పొందు పర్చారు. ముందుగా వారి వాస్తవ పరిస్థితి తెలుసుకునేందుకు 42 అంశాలతో కూడిన సమాచారాన్ని వారి నుంచి సేకరిస్తున్నారు. ప్రధానంగా వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన సదుపాయాల్లో ఇప్పటివరకు ఏవేవి కలిగి ఉన్నారు..? ఇంకా ఏవేవి కల్పించాల్సి ఉంది...? అనే అంశాలను ఈ సర్వే ద్వారా తెలుసుకుని ప్రభుత్వం ఇచ్చిన వెబ్ ఆప్షన్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. చెంచు కుటుంబాలకు పక్కా ఇళ్లు ఉందా.. లేదా..? ఇంటికి కులాయి ఉందా లేదా..? లాంటివి తెలుసుకుంటారు. ప్రతి చెంచు ఆవాసానికి రహదారి, ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం, అందరికి నాణ్యమైన విద్య లాంటివి ఈ పథకం ద్వారా అందిస్తారు. వృత్తి, విద్యా నైపుణ్యాలు, అందరికీ ఆరోగ్యం, అందరికి పోషణ, మెరుగైన టెలిఫోన్ సౌకర్యాల అనుసంధానం తదితర కార్యక్రమాల ద్వారా జీవనోపాధి మెరుగుపర్చటం లాంటివి ఈ కార్యక్రమంలో చేపట్టనున్నారు. ఉచిత నిత్యావసరాలు, ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు, గర్భిణులకు ఆర్థికసాయం, సుకన్య సంవృద్ధి యోజన, వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తదితర పథకాలు అందుతున్నాయా..లేదా..? తెలుసుకుని .. లోటుపాట్లను.. సరిదిద్దేలా చూడటం ఈ పథకం ఉద్దేశంగా ప్రభుత్వం చెబుతోంది. తెలంగాణ రాష్ట్రాన్ని కలుపుకొని 28 రాష్ట్రాల్లో ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించగా పథకం అమలుకు రూ.24వేల కోట్లు ప్రభుత్వం వెచ్చించనుంది. రాబోయే మూడేళ్లలో ఈ పథకం అమలు పూర్తి చేసి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

పథకం పక్కాగా అమలయ్యేనా..?

చెంచుల అభ్యున్నతి కోసం అమలు చేయతలపెట్టిన ఈ పథకంలో గత అనుభవాలు, వైఫల్యాలు పునరావృతం కాకుండా చూసుకోగలిగినప్పుడే చెంచుల విషయంలో ఆశించిన మార్పులు, నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవటం సాధ్యమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలోనూ ప్రభుత్వాలు వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకంటూ అనేక పథకాలు, కార్యక్రమాలు తీసుకువచ్చినప్పటికీ అవేవి కూడా వారి జీవితాల్లో ఆశించిన మార్పులను తీసుకురాలేదనే విమర్శలు ఉన్నాయి. చెంచులు బాగు పడాలంటే... వారి కుటుంబాలకు, ఆవాసాలకు మౌలిక వసతులు కల్పించటంతో పాటు మానవ వనరుల అభివృద్ధి సూచికలో ప్రధాన భూమిక పోషించే.. విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు తెలుపుతున్నారు. అలాగే వారిలో సామర్థ్యాల పెంపుదలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. అయితే ఈ పథకాలు పక్కాగా అమలు అయితేనే సక్సెస్ రేటు ఆధారపడి ఉంటుందని నిపుణుల అభిప్రాయం. లేదంటే ఇలాంటి మరిన్న పథకాలు తెచ్చిన వారి జీవితాల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ పథకం విషయంలో ప్రధాన మంత్రి పేర్కొన్న విధంగా 'నేను కేవలం అంకెలను కాకుండా జీవితాలను అనుసంధానించాలనుకుంటున్నా' అనే పదం మళ్లీ స్లోగన్‌గానే మిగిలిపోయే ఆస్కారం ఉంది. ఏది ఏమైనప్పటికీ ఒక మంచి ఉద్దేశంతో ప్రారంభించిన ఈ పథకం పక్కాగా అమలుకు నోచుకొని చెంచుల జీవితాల్లో వెలుగులు నింపాలని నిపుణులు, ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి



పీఎం జన్‌మన్ పథకం ద్వారా.. చెంచు కుటుంబాల్లో ప్రతిఒక్కరికి జన్‌ధన్ ఖాతాలు తెరవడంతో పాటు పాన్ కార్డు, ఆధార్ కార్డులు నమోదు చేయించడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో చెంచులకు ప్రత్యేకంగా నిధులు వస్తాయని ఆశించాం. అయితే ఇప్పటివరకు ఎలాంటి నిధులు రాలేదు. చెంచు ప్రజల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలి. చెంచుల కోసం ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టడంతో పాటు పర్యవేక్షించాలి.

– హన్మంతు, ఆదివాసి చెంచు సంఘం రాష్ట్ర కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్

దివ్యాంగుల సమస్యలు పట్టవా?

- పింఛన్ల పెంపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు
- 13 ఏళ్లుగా రూ.300 మాత్రమే ఇస్తున్న కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వం రూ.6వేల హామీని నిలబెట్టుకోవాలి
- ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్

కొడంగల్ రూరల్: దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందించే వాటాను పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు జె.దశరథ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పశు వైద్యశాల సమావేశం హాలులో దివ్యాంగుల డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం 2011 నుంచి పింఛన్ల వాటాలో కేవలం రూ.300 రూపాయలే ఇస్తుందని, 13ఏళ్లలో నిత్యావసర ధరలు ఎంత పెరిగినా పింఛన్లు మాత్రం పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగుల పింఛన్లను రూ.6వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని ఇప్పటివరకు పట్టించుకోవడంలేదని అన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ ప్రయాణం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం అమలు వంటివి వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. కాల పరిమితి ముగిసిన సదరం సర్టిఫికెట్స్‌ను వెంటనే రెన్యూవల్ చేయాలని, సదరం సర్టిఫికెట్లపై డాక్టర్స్ సంతకాలు లేకపోవడంతో వేలాది మంది దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం ప్రకారం కొత్తగా గుర్తించిన 14రకాల వైకల్యాలకు సదరం సర్టిఫికెట్స్ ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యల సాధనకు జులై 3వ తేదీన నిర్వహించనున్న ధర్నాలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కొడంగల్ ఏరియా కమిటీని ఎన్నుకున్నారు. ఏరియా కమిటీ అధ్యక్షుడుగా అనిమేష్, కార్యదర్శి మారుతి, కోశాధికారి సావిత్రమ్మ, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, శిరీష, దినేష్, సహాయ కార్యదర్శిగా యశోదను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల్, బొంరాస్‌పేట మండలాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష తప్పిందన్న మనస్తాపంతో..

విద్యార్థిని ఆత్మహత్య



జయశ్రీ (ఫైల్)

దోమ: పదోతరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ అయ్యానన్న మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన హైదరాబాద్ నగరం వనస్థలిపురంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం శివారెడ్డిపల్లికి చెందిన పత్యానాయక్, కెస్లీబాయ్‌కి ము గ్గురు ఆడపిల్లలు సంతానం .వారిని ఎలాగైనా బాగా చదివించాలని తల్లితండ్రులు భావించారు.అయితో స్వగ్రామంలో సరైన ఉపాధిలేక ఇటీవల హైదరాబాద్‌కు వలస వచ్చారు. వనస్థలిపురంలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. ఈ క్రమంలో చిన్న కూతురు జయశ్రీ(17) తాతాగారి దగ్గర ఉంటూ పరిగి పట్టణంలోని నంబర్–1 పాఠశాలలో ఇటీవల పదవ తరగతి పరీక్ష లు రాసింది.అయితే సామాన్య శాస్త్రంలో ఫెయిల్ అ య్యింది. అయినప్పటికీ తల్లితండ్రులు సప్లిమెంటరీ పరీక్ష ఫీజును చెల్లించి పరీక్ష రాయించారు. అయితే సప్లిమెంటరీలోనూ జయశ్రీ ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైంది. దీంతో హైదరాబాద్‌లోని వనస్థలిపురం ఇంట్లో శనివారం ఎవరూ లేని సమయంలో జయశ్రీ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించినప్పటికీ.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం స్వగ్రా మం శివారెడ్డిపల్లి తండాలో జయశ్రీ అంత్యక్రియలు పూర్తిచేశారు.

విన్నపాలు.. బుట్టదాఖలు!

ప్రజాభవన్ వేదికగా బాధితుల విజ్ఞప్తులు

- పరిష్కారానికి నోచుకోని అర్జీలు
- కలెక్టరేట్‌లో అందిన ఫిర్యాదులదీ అదే పరిస్థితి
- సీరియస్‌గా తీసుకోని అధికారులు
- ఆందోళనలో బాధితులు



కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాధారణంగా ఉన్నతాధికారి నుంచి ఏదైనా లేఖ వస్తే.. యంత్రాంగం తక్షణమే స్పందిస్తుంది. క్షేత్రస్థాయిలోని అధికారులంతా హడావుడి చేస్తుంటారు. కానీ సాక్షాత్తు ముఖ్యమంత్రి కార్యాలయం (ప్రగతి భవన్) వేదికగా స్వీకరించిన 'ప్రజాదర్బార్' దరఖాస్తులను జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం విస్తుగొలుపుతోంది. తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించిన బాధితులకు తీరా నిరాశే మిగులుతోంది. పరిపాలనలో పారదర్శకత, ప్రజల సమస్యల సత్వర పరిష్కార మార్గం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాభవన్ వేదికగా ప్రజాదర్బార్ పేరుతో వారానికి రెండు రోజులు (మంగళ, శుక్ర), జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లలో ప్రతి సోమవారం 'ప్రజావాణి' పేరుతో ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించే కార్యక్రమా న్ని నిర్వహిస్తోంది. కీలకశాఖల అధికారులంతా అక్కడే ఉంటుండటంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యకు ఏదో ఒక పరిష్కార మార్గం లభిస్తుందని భావించిన బాధితులు దూరాన్ని సైతం లెక్క చేయకుండా అనేక వ్యయ ప్రయాసలకోర్చి ప్రజాభవన్‌లో జరిగే కార్యక్రమానికి హాజరవుతున్నారు. తమ గోడును అధికారుల వద్ద వెల్లబోసుకుంటున్నారు. ఇలా ఇప్పటి వరకు ప్రజాభవన్‌కు రంగారెడ్డి జిల్లా నుంచి 2,033 దరఖాస్తులు అందాయి. వీటిలో 270 దరఖాస్తులకు మాత్రమే పరిష్కారం చూపారు. మరో 1,763 పెండింగ్‌లో పెట్టారు. ఇక హైదరాబాద్ జిల్లా నుంచి 596 అర్జీలు అందగా, వీటిలో ఏ ఒక్కటి కూడా పరిష్కారం కాలేదు. మేడ్చల్ జిల్లా నుంచి 1,194 ఫిర్యాదులు అందగా వీటిలో 1,154 పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిలో మెజార్టీ దరఖాస్తులు భూ వివాదాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, పెన్షన్లకు సంబంధించినవే ఉండటం గమనార్హం. సీఎంఓ నుంచి వచ్చిన ఫిర్యాదులను కూడా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్వీకరణతో సరి.. పరిష్కారం ఏదీ?

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమిపాలై.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజావాణికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అసెంబ్లీ ఎన్నికల కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని డిసెంబర్ 11న పునరుద్ధరించింది. డిసెంబర్ 11న జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో 132 దరఖాస్తులు అందగా, జనవరి 8న 140 దరఖాస్తులు, 22న 40 అందాయి. ఫిబ్రవరి 5న 158 అర్జీలు అందగా, 26న 82 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల కారణంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్నికలతో నిలిచిపోయిన ఈ కార్యక్రమాన్ని జూన్ 10న పునరుద్ధరించారు. జూన్ 10న 79 ఫిర్యాదులు, 24న 140 అందాయి. ఎప్పటికప్పుడు వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపి పరిష్కార మార్గం చూపించాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ మెజార్టీ దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిలో అత్యధికంగా భూ వివాదాలకు సంబంధించినవే కావడం గమనార్హం. ఇదిలా ఉంటే ధరణి పోర్టల్‌లోని 33 మాడ్యూల్స్ ద్వారా 40,242 దరఖాస్తులు రాగా వీటిలో ఈ నెల 15 నుంచి 28 వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 3,779 దరఖాస్తులను పరిష్కరించారు. మరో 36,463 పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

ప్రజాదర్బార్ దరఖాస్తులు ఇలా..

జిల్లాపేరు	స్వీకరించిన అర్జీలు	పెండింగ్‌లో ఉన్నవి
హైదరాబాద్	596	596
రంగారెడ్డి	2,033	1,763
మేడ్చల్	1,194	1,154
వికారాబాద్	478	107

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

దోమ: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో.. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే.. విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్: మండల పరిధిలోని తెలంగాణ మోడల్ కళాశాలలో నాలుగు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాత్స ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోడల్ స్కూల్, కళాశాలలో హెచ్‌బీటీ, పీజీటీ మ్యాథ్స్, టీజీటీ సైన్స్, టీజీటీ హిందీ బోధించేందుకు ఒక్కోటి చొప్పున పోస్టులు ఖాళీ ఉన్నట్టు చెప్పారు. అవర్లీ బేస్డ్‌పై ఒక పీరియడ్‌కు రూ.183 చొప్పున వంద పీరియడ్లకు రూ.18,200 గౌరవ వేతనం ఉంటుందని తెలిపారు. ఎంఎస్సీ మాథ్స్, ఎంఎస్సీ సైన్స్ (బాటనీ, జువాలజీ) బీఎస్సీ సైన్స్, ఎంఏ హిందీతో పాటు బీఎడ్ అర్హత కలిగిన వారు జూలై 2వ తేదీలోగా మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



తాండూరు 12వ వార్డులో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

వికారాబాద్ పట్టణంలో కురుస్తున్న వర్షం

భారీ వర్షం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. వికారాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడం, పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు వరణుడి రాకతో ఆనందం వ్యక్తం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్

రైతుకు ఏదీ భరోసా?

సాగుకు సమయం మించిపోతున్నా.. సర్కారు సాయం అందక అన్నదాతలు నిరుత్సాహంతో ఉన్నారు. తొలకరి జల్లులతో పులకరించిన మట్టిబిడ్డలు అప్పు చేసి సాగుబడిలో సంబుర పడినా.. వరుణుడి దోబూచులాటతో దిగాలు చెందారు. విత్తులు మొలకెత్తక పెట్టుబడులు ఆవిరై ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం భరోసా కోసం ఎదురు చూస్తున్నారు.


పంటసాగుకు సిద్ధం చేస్తున్న రైతు

- సాయం చేయని సర్కారు..
- కరుణించని వరుణుడు
- నిరుత్సాహంలో అన్నదాతలు
- 'కనక'వర్షం కోసం ఎదురుచూపులు

దౌల్తాబాద్: పంట పెట్టుబడి కోసం రైతులు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతుబంధు పేరిట పంట సహాయ పథకానికి శ్రీకారం చుట్టింది. రెండు సీజన్‌లకు కలిపి ఎకరాకు రూ.10వేల చొప్పున చెల్లించింది. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, రైతుబంధును.. రైతుభరోసా పేరుతో ఎకరాకు రూ.15వేలు చెల్లిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ.. పాత పద్ధతినే అనుసరిస్తూ సాగు సాయం అందజేసింది. అయితే ప్రస్తుత వానాకాలం సీజన్‌లోనైనా సాయం పెంచి సకాలంలో అందజేస్తుందని కర్షకులు భావించినప్పటికీ.. సర్కారు నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది.

19,300 మంది రైతులు

మండల పరిధిలో రైతుభరోసా పథకానికి అర్హులుగా 19,300మంది రైతులను వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. గత యాసంగిలో 15,856 మందికి రూ.13కోట్ల 11లక్షల 83వేలు భరోసా కింద పంపిణీ చేశారు. ప్రస్తుత సీజన్ నుంచి ఎకరాకు రూ.15వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేదు. ఇప్పటికే సాగుపనులను రైతులు ముమ్మరం చేశారు. ఎరువులు, విత్తనాల కొనుగోలు, తదితర వాటికి అయ్యే పెట్టుబడికి వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

సీజన్ ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా తొలకరి జల్లులే తప్ప.. భారీ వర్షం కురిసింది లేదు. తొలిరోజుల్లో విత్తనాలు విత్తితే మొలకెత్తుతాయని ఎంతో సంబురపడ్డారు. ముందస్తుగా విత్తడంతో సీజన్‌ముగింపు సమయంలో వర్షాభావ పరిస్థితులు ఎదురైతే పంటలు దెబ్బతినకుండా అధిక దిగుబడి పొందవచ్చనే ఆశతో ముందుకు సాగారు. కానీ సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ఈ తరుణంలో ప్రభుత్వం త్వరగా పెట్టుబడి సాయం అందజేస్తే రైతులకు ఆసరాగా ఉంటుంది.

"సాయం ఎప్పుడు చేస్తుందో..



సీజన్‌కు ముందే ప్రభుత్వం పంటకు పెట్టుబడి సాయాన్ని అందజేస్తే ఉపయోగపడేవి. సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా.. రైతుభరోసా గురించి స్పందించడం లేదు. అసలు ఇస్తుందో లేదో తెలియదు. త్వరగా ఇస్తే.. మాకు మేలు చేకూరుతుంది.

– మల్కయ్యగౌడ్, రైతు, దౌల్తాబాద్

అర్హులకే సాగుసాయం ఇవ్వండి

ప్రజాభిప్రాయ సేకరణలో స్పష్టం చేసిన రైతులు


సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ ఈశ్వరయ్య

కుల్కచర్ల: అర్హులకే రైతుభరోసా ఇవ్వాలని రైతులు ముక్తకంఠంతో స్పష్టంచేశారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుభరోసా పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. 10 ఎకరాల లోపు భూములు ఉన్న రైతులకు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి, పెట్టుబడి సాయం నిలిపివేయాలన్నారు.

అందరికీ ఒకే విధంగా..

కేంద్ర ప్రభుత్వం రైతులకు విడుదల చేస్తున్న నిధుల్లాగే అందరికీ ఒకే విధంగా ఆర్థిక సహాయం అందజేయాలని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. డీసీఓ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభిప్రాయాలను సేకరించాలన్న ఆదేశంతో ప్రతి మండలంలో ప్రజాభిప్రాయసేకరణ జరుపుతున్నామని, అనంతరం వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీ ఆనందం, డైరెక్టర్లు కొండయ్య, నర్సింలు, ఉమ్లా, నాయకులు జోగు వెంకటయ్య, కృష్ణయ్య, చిన్నయ్య, ఉమాశంకర్, రాంచంద్రయ్య, ఆలీం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిన చోరులు

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
- 15 తులాల బంగారం, రూ1.2లక్షల నగదు అపహరణ


చెల్లాచెదురుగా సామగ్రి

పరిగి: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు చెలరేగిపోయారు. ఏకంగా ఐదు ఇళ్ల తాళాలను పగలగొట్టి, అందిన కాడికి దోచుకెళ్లారు. ఈ సంఘటన పట్టణ కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ కేంద్రంలోని టీచర్స్, వేంకటేశ్వర కాలనీల్లో బంద్యనాయక్ సాయిరాం, శ్రీనివాస్, శ్రీకాంత్, ఆనంద్‌రావు ఇళ్ల తాళాలను పగల గొట్టి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. శ్రీకాంత్ నివాసంలో 3తులాల 3 మాసాల బంగారం, బంద్యనాయక్ ఇంట్లో 12తులాల బంగారం, రూ.1.2లక్షల నగదు చోరీకి గురయింది. మిగతా ముగ్గురు ఇళ్లల్లో ఎలాంటి దొంగతనం జరగలేదు. స్థానికుల సమాచారంతో ఆయా యజమానులు ఇంటికి చేరుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించారు. క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కేసు నమోదు చేసుకున్నారు. దొంగల కదలికలన్నీ సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయని, వాటిని పరిశీలించి దొంగలను పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. కొంత కాలంగా పరిగిలో దొంగతనాలు పెరిగిన నేపథ్యంలో.. ఇంటికి తాళం వేసి వెళ్లాలంటే పట్టణవాసులు భయాందోళన చెందుతున్నారు. పట్టణ కేంద్రంలో పోలీసులు గస్తీ పెంచి, రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

మృత్యు మార్గాలు

ప్రమాదకర మలుపులతో వాహనదారుల భయాందోళన


చరికొండ గ్రామ సమీపంలో ప్రమాదకర మలుపు

కడ్తాల్: ప్రమాదకర మలుపులతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లలో ఉన్న మూల మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేక పోవడంతో భయాందోళన చెందుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక ప్రమాదాల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. పలువురు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయని పరిసరప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఊహించనిప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి, సూచిక బోర్డులతో పాటు,ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

బైక్ ఢీకొని కార్మికుడికి గాయాలు

మొయినాబాద్: గుర్తుతెలియని బైక్ ఢీకొట్టడంతో పంచాయతీ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి చిలుకూరు బాలాజీ టెంపుల్ కమాన్ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన ఆర్.ప్రవీణ్ జీపీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి దేవాలయ కమాన్ వద్ద ప్రవీణ్ నిలబడి ఉండగా.. గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనంలో ప్రవీణ్ తలకు గాయాలు కావడంతో పాటు కాలు విరిగింది. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని ఆటోలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

తలకొండపల్లి: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఆయన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును హైదరాబాద్‌లోని నివాసంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితిని హరీశ్‌రావు అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధిక స్థానాలు గెలిచేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

యజమానుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం

టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్

షాద్‌నగర్: పరిశ్రమ యజమానుల నిర్లక్ష్యం కారణంగానే పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిందని, బాధిత కార్మిక కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ.. సౌత్ గ్లాస్ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో ఐదుగురు కార్మికులు మృత్యువాత పడటం దురదృష్టకరమన్నారు. పేలుడు ఘటనలో గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు సరైన రీతిలో చర్యలు తీసుకోవడం లేదన్నారు. బాధిత కార్మిక కుటుంబాలకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

కేశంపేట: దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమవుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు రొల్లు రాఘురాంగౌడ్ అన్నారు. బీజేపీ నాయకులు, ప్రజలతో కలిసి మండల పరిధిలోని లింగంధన గ్రామంలో మాన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందదర్భంగా రొల్లు రఘురాంగౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా నిర్వహించిన మాన్‌కీబాత్ కార్యక్రమంలో భాగస్వాములవడం అనందంగా ఉందన్నారు. మాన్‌కీబాత్ కార్యక్రమంలో మోదీ తన మనసులోని మాటలను ప్రజలతో పంచుకున్నారన్నారు. రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు రాధిక, శక్తి కేంద్ర ఇన్‌చార్జి రమేశ్, బూత్ అధ్యక్షులు వెంకటేశ్వరి, అంజయ్య, సువర్ణ, అరుణమ్మ, మంగమ్మ, వనజబాయి, స్వప్నిక తదితరులు పాల్గొన్నారు.

కానరాని రైతు నేస్తాలు


షాతాళ్లపల్లి గ్రామంలో ట్రాక్టర్లతో కరిగెట్లు చేస్తున్న రైతు

భారంగా మారిన పశుపోషణ

- యంత్రాలతోనే ఎవుసం
- పెరిగిన సాగు పెట్టుబడులు
- రైతులకు ఆర్థిక భారం

షాబాద్: వ్యవసాయ పనుల్లో అన్నదాతలకు అండగా ఉండే కాడెడ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పెరుగుతున్న యాంత్రీకరణ జీవనవిధానం, పశుపోషణ భారంగా మారడంతో కాడెడ్ల ఆదరణ పూర్తిగా తగ్గింది. సాగు మొదలు పంట ఉత్పత్తులను తరలించేంత వరకు తోడుగా ఉండేవి. ప్రస్తుత పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. పశుపోషణ భారమై.. ఆధునిక యంత్రాలు, ట్రాక్టర్ల వాడకానికి మొగ్గుచూపడంతో ఎడ్లు సాగు పనులకు దూరమవటమే కాకుండా.. వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. పశుపోషణ కష్టంగా భావించిన రైతులకు యంత్రాల వాడకంతో పని వేగవంతమైనా.. పెట్టుబడులు విస్తృతంగా పెరిగాయి. ట్రాక్టర్ల యాజమానులు గంటకు కిరాయి రూ.1300 నుంచి రూ.1500 వరకు డిమాండ్ చేస్తుండటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ముందుకు సాగుతున్నారు.

ఆసక్తి చూపని అన్నదాతలు

పశుపోషణ భారం కావడంతో పొలం పనుల్లో ఎడ్ల వినియోగం రోజురోజుకూ తగ్గిపోతోంది. నాడు ప్రతి గ్రామంలో అధికశాతం రైతుల కుటుంబాల్లో ఎనలేని పశు సంపద ఉండేది. అందులో పాడి పశువులతో పాటు, కాడెండ్లు ఉండేవి. ఎడ్లను పొలం పనులకు, బర్లతో పాల ఉత్పత్తి పొంది, లబ్ధిపొందేవారు. కానీ.. ప్రస్తుతం అవి పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. అన్నదాతలు కూడా వాటి పెంపకానికి ఆసక్తి చూపించడం లేదు.

పెరిగిన యంత్రాల వినియోగం

వ్యవసాయ పనులకు కూలీలపై ఆధారపడకుండా రైతులు ట్రాక్టర్ల ద్వారా పనులు చేపడుతున్నారు. పత్తి కర్రను తొలగించేందుకు ఎకరానికి రూ.800 నుంచి రూ.1000 వరకు చెల్లిస్తున్నారు. దుక్కి దున్నేందుకు ఎకరానికి రూ.1300 నుంచి 1500 వరకు వెచ్చిస్తున్నారు. విత్తనాలు వేసే సమయంలో భూమిని చదును చేయడానికి రోటవేటర్ కోసం ఎకరానికి రూ.100 నుంచి రూ.1400 వరకు ఖర్చు పెడుతున్నారు.

తాళం తియ్యరు.. అద్దెకివ్వరు

- నిరుపయోగంగా దుకాణ సముదాయం
- పట్టించుకోని అధికారులు


వినియోగంలో లేని షాపింగ్ కాంప్లెక్స్

పెద్దేముల్: జడ్పీ నిధులతో నిర్మించిన మండల పరిషత్ దుకాణ సముదాయం నిరుపయోగంగా మారింది. కాంప్లెక్స్ ప్రారంభించి ఏడాది గడుస్తున్నా, వాటి తాళం తీసింది లేదు.. అద్దెకు ఇచ్చింది లేదు. అసలు దీని గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.

కాలయాపన

నిరుపేదల ఉపాధి కోసం, మండల అభివృద్ధికి ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు రెండేళ్ల క్రితం రూ.20లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఏడాది క్రితం అట్టహాసంగా ప్రారంభించారు. కానీ.. వినియోగంలోకి తేలేదు. దుకాణం వేలం వేయడమో, అద్దెకు ఇవ్వడమో చేస్తే.. దక్కించుకుని ఉపాధి పొందుదామనుకున్న నిరుద్యోగ యువతకు, వ్యాపారులకు నిరుత్సాహం మిగిలింది. దీని గురించి ఎవరు అడిగినా ఎంపీపీ పేరుతో, ఎంపీడీఓ, ఎంపీడీఓ పేరుతో ఎంపీపీ నేడు, మాపు అంటు కాలం గడుపుతున్నట్లు సమాచారం.

కోల్పోతున్న ఆదాయం

రూ.లక్షలు పోసి నిర్మించిన దుకాణ సముదాయం గురించి పాలకులకు, సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదని స్థానిక వ్యాపారులు, యువత ఆరోపిస్తున్నారు. వినియోగంలోకి తెచ్చి వ్యాపారులకు అద్దెకు ఇస్తే.. ఒక్కో మడిగెకు నెలకు అద్దె రూపేనా.. సుమారు రూ.1500 నుంచి రూ.2వేల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని, అధికారుల నిర్లక్ష్యంతోనే షట్టర్లు నిరుపయోగంగా పడున్నాయని స్థానికులు తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

"త్వరలో అద్దెకు ఇస్తాం



షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉన్నది వాస్తవమే. ఇదే విషయాన్ని జిల్లా పరిషత్ అధికారులతో మాట్లాడి, ఉపయోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఆసక్తి గల వ్యాపారులకు అద్దెకు ఇస్తాం.

– అనురాధ, ఎంపీపీ, పెద్దేముల్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



దుకాణ సముదాయం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వినియోగంలోకి తెచ్చేలా తక్షణమే చర్యలు తీసు కుంటాం. మడిగెలను అద్దెకు ఇచ్చి, మండల పరిషత్‌కు ఆదాయం సమకూరుస్తాం.

– జర్నప్ప, ఎంపీడీఓ, పెద్దేముల్